# వరి నార్లు పైలం!

చలితో జాగ్రత్తలు తప్పనిసరి

- యాజమాన్య పద్ధతులు పాటించాలి
- రైతులకు కూనారం వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త సిద్ధి శ్రీధర్ సూచన

యాసంగి సీజన్‌కు సంబంధించి వరి నార్ల విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని, చలి ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని కూనారం వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త సిద్ధి శ్రీధర్ సూచిస్తున్నారు. ఈ మేరకు ఆయన పలు విషయాలను రైతులకు వివరించారు.

-కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్ 10



రైతులు ఎక్కువగా దొడ్డు గింజ రకాల సాగువైపు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని స్వల్పకాలిక రకాలైన (120-130 రోజుల పంట కాలం) కూనారం సన్నాలు( కేఎన్‌ఎం-118), ఎంటీయూ 1010 (కాటన్ దొర సన్నాలు), జగిత్యాల రైస్-1( జేజీఎల్-24423) ఆర్‌ఎన్‌ఆర్ 29325 వంటి రకాలను సాగు చేసుకోవచ్చు. ఈ రకాలను నవంబర్ 15 నుంచి డిసెంబర్ 20 వరకు నారు పోసుకోవచ్చు. చలి ఉధృతిని బట్టి పంట కాలం 10 నుంచి 15 రోజుల వరకు పెరిగే అవకాశముంది. అందువల్ల చలి ప్రభావం నారుమళ్లపై పడకుండా ప్రత్యేక నారుమడి యాజమాన్య పద్ధతులు పాటించాలి.



## నారుమడుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చలికి తట్టుకునే వరి వంగడాలను ఎంపిక చేసుకోవాలి.
- నారుమడిలో మండె కట్టిన విత్తనాలను వేయడం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలి.
- నారుపోసుకునే ముందు నారు మడికి సరిపడా సుమారు 2 క్వింటాళ్లు బాగా మాగిన పశువుల ఎరువు లేదా కోళ్ల ఎరువు, కిలో జింక్ సల్ఫేట్ తప్పనిసరిగా వేసుకోవాలి.
- ఎకరానికి సన్నగింజ రకాలైతే 15 కిలోలు, దొడ్డుగింజ రకాలైతే 25 కిలోల విత్తనం సరిపోతుంది.
- కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజిమ్ కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.
- దుంప నారుమళ్లయితే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజిమ్ కలిపి ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి మండె కట్టుకోవాలి.
- వానకాలంలో పండించిన విత్తనాలను యాసంగిలో సాగు చేసే పక్షంలో నిద్రావస్థను గమనించి విత్తుకోవాలి.
- భాస్వరాన్ని రెట్టింపు మోతాదులో వేసుకోవాలి.
- రాత్రిపూట నారుమడిలో నీళ్లు లేకుంటే చలి ప్రభావం మొక్కలపై తగ్గుతుంది. కాబట్టి ప్రతిరోజూ ఉదయం, పగటిపూట వెచ్చని నీటిని పెట్టి సాయంత్రం తీసివేయాలి.
- చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు నారుమడి చుట్టూ అడుగుఎత్తులో పలచని పాలిథీన్ షీట్ లేదా ఖాళీ ఎరువుల సంచులతో కుట్టిన పట్టాలను సాయంత్రం వేళ కప్పి ఉదయం పూట తీసివేయాలి.
- రాత్రి ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తగ్గినప్పుడు చలి తీవ్రత పెరిగి నారు ఎర్రబడడం, సరిగ్గా ఎదగక పోవడం వల్ల పంట కాలం పెరిగిపోవడం, పోషకలోపాలు ముఖ్యంగా జింక్‌లోప లక్షణాలు కనిపించే అవకాశం ఉంది.
- జింక్ లోపం వల్ల అకులపై తుప్పు మచ్చలు ఏర్పడతాయి. దీని లోప నివారణకు లీటరు నీటికి 2గ్రాముల జింక్‌సల్ఫేట్ కలిపి పిచికారీ చేసుకోవాలి.
- చలి తీవ్రత ఎక్కువగా ఉంటే స్వర్ణఫాల్/ఫార్ములా4 వంటి సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 5 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.
- కాండం తొలిచే పురుగు బారి నుంచి నారును కాపాడుకోవడానికి, నారు పీకడానికి వారం రోజుల ముందు, 5 సెంట్ల నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3 జీ గుళికలు వేసుకోవాలి.
- చలి తీవ్రత ఎక్కువగా ఉంటే అగ్గి తెగులు ఆశించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తగా లీటరు నీటికి 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్‌ను కలిపి పిచికారీ చేయాలి. ఈ పద్ధతులను రైతులు పాటిస్తే ఆరోగ్యవంతమైన నారుపెంచుకొని, అధిక దిగుబడులు సాధించుకోవచ్చు.



# చికెన్ రేట్లు ఢమాల్

- అమాంతం పడిపోయిన కోడి కూర ధర
- ₹220 నుంచి ₹150కి తగ్గిన కిలో స్కిన్‌లెస్ చికెన్
- ₹190 నుంచి ₹120కి విత్ స్కిన్
- ₹100 లోపే కిలో కోడి ధర
- కార్తీక మాసం, కోళ్ల ఉత్పత్తి పెరగడమే కారణం!
- పెట్టుబడి కూడా చేతికి రాక అవస్థలు



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ):బ్రాయిలర్ కోళ్ల పెంపకం కత్తి మీద సాములా మారింది. ఒక పక్క పెరుగుతున్న ఫీడ్ ధరలు, తగ్గుతున్న కోళ్ల ధరలు కలగలిపి ఫౌల్ట్రీ రైతును కుదేలు చేస్తున్నాయి. లేయర్ కోళ్ల పెంపకం దారుల పరిస్థితి ఫరవాలేదనిపిస్తున్నా బ్రాయిలర్ రైతులకే కష్టాలు వచ్చి పడ్డాయి. ఫలితంగా ఇన్నాళ్లూ కొండెక్కిన చికెన్ ధర దిగివస్తోంది. నిన్నా మొన్నటిదాకా కిలో చికెన్ (స్కిన్ లెస్) ధర ₹220 పలుకగా, ఇప్పుడు ఒక్కసారిగా ₹150కి పడిపోయింది. అదే విత్ స్కిన్ అయితే ₹120కే దొరుకుతున్నది.

## ఫౌల్ట్రీ రైతులకు నిరాశే..

కోళ్ల పెంపకం అనేది ఫౌల్ట్రీ రైతులకు తీవ్ర నిరాశను మిగిలిస్తోంది. గతంలో మంచి లాభసాటి పరిశ్రమగా కొనసాగిన ఫౌల్ట్రీ రంగంలోకి అనేక మంది ఉత్సాహంగా ప్రవేశించారు. మంచి లాభాలను కూడా ఆర్జించారు. ఈ రంగంలో కొన్ని కార్పొరేట్ సంస్థలు ప్రవేశించడంతో మామూలు రైతులు సదరు సంస్థలతో పోటీ పడలేని పరిస్థితి నెలకొన్నది. క్రమంగా ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి వస్తోంది. గత కొన్నాళ్లుగా ఫౌల్ట్రీ రంగం ముఖ్యంగా బ్రాయిలర్ రైతులు నష్టాలను చవిచూస్తున్న పరిస్థితి నెలకొన్నది. ఒక పక్క ఫీడ్ ధరలు పెరగడం, కోడి పిల్లల ధరలు ఆకాశానికి అంటడం, పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. లేయర్ కోళ్ల పెంపకం రైతులు కాస్త అటీటుగా అటు లాభాలు కాకుండా ఇటు నష్టాలు కాకుండా అన్నట్లుగా కొనసాగుతుంటే బ్రాయిలర్ కోళ్ల పెంపంలో ఉన్న రైతులు మాత్రం క్రమంగా తీవ్రమైన నష్టాల్లో కూరుకుపోతున్నారు.

## దిన దినం పెరుగుతున్న ఫీడ్ ధరలు..

కోళ్లకు ఇచ్చే దానా కింద వివిధ రకాల ఫీడ్స్‌ను అందిస్తుంటారు. మార్కెట్‌లో దానా ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఏడాది కిందటి వరకు రూ.1,500, 1,600 మాత్రమే ఉన్న మక్కల ధర ఇపుడు రూ.2,340 నుంచి రూ.2,400 వరకు పలుకుతోంది. మంచి ఆహారంగా అందించేందుకు సోయాబిన్ వంటి ఫీడ్ ధరలు చూస్తే ఆకాశాన్ని అంటుతున్నాయి. రూ.5,200 క్వింటాలు అవుతోంది. ఈ లెక్కన ఒక్క కోడి కిలో బరువు వచ్చేందుకు కనీసం రూ.90 నుంచి 100 విలువైన దాన ఇవ్వాల్సి ఉంటుంది. ఇది కాకుండా కోడి పిల్లల ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. కోళ్లు పెంచడానికి అయ్యే కరెంట్ చార్జీలు, కూలీలకు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. అంతకు మించి మెడిసిన్ ఖర్చులు కూడా భరించాల్సి వస్తోంది.

## అమాంతం పడిపోయిన కోళ్ల ధరలు..

ఇటీవలి కాలంలో బ్రాయిలర్ కోళ్ల ధరలు బాగా తగ్గిపోతున్నాయి. వీటి ధరలు కార్పొరేట్ సంస్థలు, ట్రేడర్లు నిర్ణయిస్తుండడంతో సాధారణ రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. గతంలో కోడి కిలో ధర రూ.120 నుంచి రూ.130 దాకా ఉండేది. ఇపుడు రూ.50 నుంచి 60కి పడిపోయింది. ఒక్క కోడి కటింగ్ వచ్చే వరకు పెంచాలంటే కనీసం రూ.90 నుంచి రూ.100 పెట్టుబడి పెడుతున్న రైతులు, ఇపుడు ఎంత నష్టాన్ని ఎదుర్కొంటున్నారో అర్థం చేసుకోవచ్చు. కనీసం రూ.90కి కిలో కోడి అమ్మినా లాభ నష్టాలు లేకుండా పెట్టుబడి చేతికి వచ్చేది. కానీ ఇపుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఒక్కో కోడిపై రూ.40 నుంచి రూ.50 నష్టానికి అమ్ముకోవాల్సి వస్తోందని ఫౌల్ట్రీ రైతులు వాపోతున్నారు. ఈ లెక్కన కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 30 లక్షల కోళ్లు రీప్లేస్‌మెంట్ చేస్తుంటారు. అంటే ఒక్కో కోడిపై రైతులకు ఎంత నష్టం వస్తున్నదో అర్థం చేసుకోవచ్చు.

## పరోక్ష నష్టాలు అధికమే..

కోళ్ల ధరలు పడిపోవడంతో ప్రత్యక్షంగా రైతులపైనే కాకుండా పరోక్షంగా కూడా పలువురిపై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా కోళ్లను రవాణా చేసే వారిపై చికెన్ సెంటర్లు నడుపుకునే వారిపైనా దీని ప్రభావం కనిపిస్తోంది. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో ఈ పరిస్థితి ఏర్పడిందనే భావన కనిపిస్తున్నా, గత కొంత కాలంగా నష్టాలు చవిచూస్తున్న బ్రాయిలర్ రైతులు ఈ కారణాన్ని పూర్తిగా అంగీకరించడం లేదు. పెరుగుతున్న ఫీడ్ ధరలు, తగ్గుతున్న కోళ్ల ధరలు గత కొంత కాలంగా హెచ్చుతగ్గులకు గురవుతున్న పరిశ్రమ పరిస్థితిని ఇందుకు నిదర్శనంగా చూపుతున్నారు. ప్రస్తుతం హోల్‌సెల్‌గా విక్రయించే చికెన్ ధరలను పరిశీలిస్తే లైవ్ కోడికి కిలో ధర రూ.100, చికెన్ ధర రూ.130, స్కిన్ లెస్ అయితే రూ.160 పలుకుతోంది. అంటే ఒకప్పుడు రైతుకు కిలో కోడికి పడిన ధర ఇపుడు హోల్ సెల్ చికెన్‌కు పలుకుతోంది. ఈ పరిస్థితిని తెలుసుకుంటే బ్రాయిలర్ కోళ్ల రైతులు ఎంతగా నష్టపోతున్నారో అర్థం చేసుకోవచ్చు.


### కోలుకోవడం కష్టమే..



ప్రస్తుతం పౌల్ట్రీ రైతులు గడ్డుకాలం ఎదుర్కొంటున్నారు. ఈ నష్టాల నుంచి కోలుకోవడం కష్టమే. కొన్ని కార్పొరేట్ కంపెనీలు పౌల్ట్రీ రంగంలోకి రావడంతోనే రైతులకు ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా కార్పొరేట్ కంపెనీల పోటీతత్వమే చిన్నచిన్న పౌల్ట్రీ రైతులకు ఎక్కువగా నష్టం వాటిల్లుతుంది. కొన్ని యాజమాన్య పద్ధతులు అనుసరిస్తే నష్టాలను పూడ్చుకోవచ్చు. అదనపు ఖర్చులను తగ్గించుకోవాలి. ప్రభుత్వం కూడా చిన్నచిన్న పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలి. కిలో చికెన్ ధర రూ.200 ఉంటే రైతుకు పెట్టుబడి మీద పడదు.

- వెంకట్‌రెడ్డి, పౌల్ట్రీ రైతు(హుజూరాబాద్)

### గిరాకీ బాగా తగ్గింది..



కార్తీక మాసం కావడంతో గిరాకీలు బాగా తగ్గాయి. దీనికితోడు కోళ్లు, చికెన్ ధరలు సైతం బాగా తగ్గాయి. గతంలో ఉన్న ధరకు ఇప్పటి ధరకు దాదాపు సగం వరకూ తగ్గింది. పేపర్ రేట్ తగ్గుతూ వస్తున్నది. బాయిలర్ ధరలు తగ్గాయి. కాకపోతే ఉన్న కాడికి బాయిలర్ కోళ్లు, చికెన్ మాత్రమే ఎక్కువగా సేల్స్ ఉంటది. కానీ ఇప్పుడు మార్కెట్లో ధరలు పడిపోయినై.

- ఎండీ ఆసీఫ్‌ఖాన్, చికెన్, వ్యాపారి పెద్దపల్లి

### కోళ్లు, చికెన్ ధర బాగా తగ్గింది..



కోళ్ల ధరలు బాగా తగ్గాయి. పేపర్ రేట్ ప్రకారం కిలో కోడి రూ.70ఉంది. చికెన్ రేటు కూడా తగ్గించాం. కోళ్ల సైజు పెద్దగానే ఉన్నా, రేటు మాత్రం తక్కువగానే ఉంది. మొన్నటి వరకు ధరలు బాగానే ఉండేది. కానీ పేపర్ ధర తగ్గుతూ పోతున్నది. సేలింగ్ కూడా తక్కువగానే అవుతున్నది. అందుకే తక్కువగానే వేసుకొని అమ్ముతున్నాం. పగలంతా ఖాళీగానే ఉంటున్నం. పెద్దగా గిరాకీ ఉండడం లేదు.

- షేక్ ఇస్మాయిల్, చికెన్ వ్యాపారి, మంథని

# ధర్మపురిలో భక్తుల రద్దీ



స్వామివారి దర్శనానికి ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

ధర్మపురి, డిసెంబర్ 10: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామివారి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొన్నది. కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి భక్తులు తరలివచ్చారు. గోదావరిలో స్నానమాచరించి సంకల్పాది పూజలు నిర్వహించారు. నదిలో కార్తీక దీపాలను వదిలారు. అనంతరం ప్రధాన దేవాలయమైన లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరిక చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. బ్రాహ్మణులకు దీపదానాలు చేసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.



ఆలయంలో ఉసిరిక చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు





శ్రీనివాస్ వ్యవసాయ క్షేత్రంలో సాగు చేసిన వరి వంగడాలు | కోసిన వరి విత్తనాలను సేకరిస్తున్న శ్రీనివాస్.

# విత్తనోద్ధారకుడు

దేశీయ వరి వంగడాల ప్రేమికుడు యాదగిరి శ్రీనివాస్

పెద్దపల్లి, డిసెంబర్ 10(నమస్తే తెలంగాణ): మాములుగా ఒకరకం వరి పంట పండించాలంటేనే ఈ రోజుల్లో రైతులు ఎంతో శ్రమించాల్సి వస్తుంది. అటువంటిది పెద్దపల్లి జిల్లాలో ఓ రైతు ఏకంగా 300 రకాల వరిని పండిస్తున్నాడు. వాటిలో కొన్ని కనుమరుగవుతున్న వరి రకాలు ఉండగా, మరికొన్ని సాంప్రదాయ రకాలు కూడా ఉన్నాయి. తనకున్న మూడెకరాల పొలంలోనే ఈ 300 రకాల వరిని పండించడం విశేషం. మన పంట మన ఆరోగ్యం, జీవ వైవిధ్యంలో దేశీ వరికి సంబంధించి మొదట 5 రకాల వరి మాత్రమే సాగు చేసిన మంథనికి చెందిన యాదగిరి శ్రీనివాస్, ఇప్పుడు 300 వందల రకాల వరి వంగడాలు సాగు చేస్తూ, భావి తరాలకు అందించే ప్రయత్నం చేస్తున్నాడు. పూర్తి సేంద్రియ విధానంలో సొంతంగానే జీవామృతం తయారు చేసుకుంటూ వ్యవసాయం చేస్తున్నాడు.

## ఉద్యోగం చేస్తూనే..

యాదగిరి శ్రీనివాస్‌ది పెద్దపల్లి జిల్లా మంథని పట్టణం. 2002-04 లో పొలాస వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీలో డిప్లామా పూర్తి చేశాడు. అనంతరం వ్యవసాయాన్నే వృత్తిగా ఎంచుకొని శాస్త్రీయ విధానాలతో మంచి దిగుబడులు సాధించాడు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ 2011 లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఉత్తమ వరి రైతుగా, సేంద్రియ రైతుగా ఎంపికయ్యాడు. అదే ఏడాది వ్యవసాయ శాఖలో వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ)గా ఉద్యోగం వచ్చింది. అటు ఉద్యోగం చే స్తూ ఇంటి దగ్గర స్వతహాగా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం చేయ డం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో అంతరించిపోతున్న దేశీయ, పురాతన వరి వంగడాలను మనుగడలో ఉంచాలని సంకల్పించాడు.

## వ్యవసాయ క్షేత్రమే కార్యశాల..

దేశవాళీ విత్తన సంపద పరిరక్షణకు నడుంబిగించిన శ్రీనివాస్ 2016లో తన పొలాన్నే కార్యశాలగా మార్చుకున్నాడు. తొలుత నాలుగు పిల్లర్లు వేసి దానిపై కంటైనర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఆ తర్వాత అదే కంటైనర్‌లో రెండు గదులను ఏర్పాటు చేసుకొని తన భార్య, పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. కంటైనర్ కింది భాగంలో సైతం గదులను ఏర్పాటు చేసుకొని ఫాంహౌస్ నిర్మించుకొని ఉద్యోగంలో దొరికే తీరిక సమయాన్ని వ్యవసాయానికే కేటాయిస్తున్నాడు. ఈ క్రమంలో ''ఒక విత్తనం మనుగడలో ఉండాలంటే అది ప్రతి సంవత్సరం సాగులో ఉండాల్సిందే' అన్న విషయాన్ని మదిలో ఉంచుకొని దేశీ వంగడాలను ఇతర ప్రాంతాల నుంచి సేకరిస్తున్నాడు. తన క్షేత్రంలో ఒక్కో వంగడాన్ని ఐదు గుంటల విస్తీర్ణంలో పండిస్తూ విత్తనోత్పత్తి చేస్తున్నాడు. మొదట అరుదైన ఐదు ర కాలను సేకరించిన శ్రీనివాస్, ప్రకృతి వ్యవసాయ విధానంలో విత్తనోత్పత్తి చేసి సక్సెస్ అయ్యాడు. అలా మొదలైన వంగడాల పరిరక్షణ ఈ రోజు 300 రకాలకు చేరింది. ఈ క్రమంలోనే శ్రీనివాస్ కృషిని గుర్తించిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారు దేవదేవుని ప్రసాదంగా ప్రతిరోజూ ఒక దేశవాళి బి య్యంతో తయారు చేయాలనే సం కల్పంతో ''కాంతియా నొయి లి'' అనే విత్తనాన్ని శ్రీనివాస్‌కు అందించారు. వాటిని విత్తనోత్పత్తి చేశాడు. ఏడు నెలలు మాగిన అనంతరం వాటిని బియ్యంగా మార్చి దాదాపు రెండు లోడ్లు పంపించారు.



రామగిరి మండలం గుంటూరుపల్లి వద్దగల శ్రీనివాస్ వ్యవసాయ క్షేత్రం

## తెలంగాణ సహా పక్క రాష్ట్రాలకు ఎగుమతి

శ్రీనివాస్ పరిరక్షిస్తున్న దేశీ వంగడాలకు దేశవ్యాప్తంగా భారీ డిమాండ్ ఉంది. ఒక్కో రకానికి ఒక్కో ప్రత్యేకత ఉండడం, ఆరోగ్యానికి ఎంతో మేలు చేసేవి కావడంతో చాలా మంది రైతు శ్రీనివాస్‌ను ఆశ్రయిస్తూ విత్తనాలు తీసుకెళ్తున్నారు. అంతే కాదు మన రాష్ట్రం సహా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లోని రైతులకు విత్తనాలను ఎగుమతి చేస్తున్నాడు. దేశవాళీ విత్తనం అందరికీ చేరాలి అనే లక్ష్యంతో పనిచేస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం వారికి కూడా విత్తనాలు అందజేసి వారి ద్వారా ఎక్కువ మంది రైతులకు చేరేలా ప్రయత్నం శ్రీనివాస్ చేస్తున్నాడు. శ్రీనివాస్ యొక్క వ్యవసాయ క్షేత్రంలో జరిగే సాగు వివరాలు, పంట విశేషాలు స్థానిక పత్రికలకు, వ్యవసాయ మన పత్రికలకు పంపి, టెలివిజన్ ద్వారా, న్యూస్ చానల్స్ ద్వారా మరింత మంది రైతులకు చేరేలా చూస్తున్నాడు.

## అరుదైన రకాలు.. బాక్సుల్లో నారు

వ్యవసాయం గురించి, వరి పంట గురించి సాంకేతిక సమాచారం తెలిసి ఉండడం వల్ల ప్రస్తుతం మనుగడలో ఉన్న అపురూపమైన దేశవాళీ వరి రకాలు ఎక్కడా కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. దేశవాళీ రకాలను బురదలో ఒకే దగ్గర ఎక్కువ సంఖ్యలో నీరు పోసినప్పుడు నీటి ద్వారా గింజలు ఒకరకంతో ఒకటి కలిసి ఇబ్బందులు ఎదురవుతాయని భావించి, ప్లాస్టిక్ ట్రేలలో నారు పెంపకం చేస్తున్నాడు. దీని వల్ల ఎన్ని రకాలైనా ఇబ్బంది లేకుండా నారు పోసుకునే అవకాశం లభించింది. రెండు అడుగుల పొడవు, ఒక అడుగు వెడల్పు ఉండే ట్రేలలో తాను తయారు చేసిన ఘన జీవామృతం బూడిద సమపాళ్లలలో కలిపి నింపి వరి విత్తులు చల్లి, తర్వాత కొన్ని పద్ధతుల ద్వారా 18-20రోజులకే నారు సిద్ధం చేస్తున్నాడు. ట్రేలలో పెంచడం వల్ల కూలీలు నాటు సులువుగా వేయగలుగుతున్నారు.

## శ్రీనివాస్ కాపాడుతున్న దేశవాళీ వరి రకాలు ఇవే..

గురుమట్టియా వెదురు సన్నాలు, నారాయణ కామిని రకం. ఇది ఇది దొడ్డురకం వరి పంట. ఇందులో అధిక పోషకాలు, పీచు పదార్థాలు కలిగి ఉంటాయి. రక్తపాలి. ఇది ఎరుపు రంగుగా ఉండి మధ్యస్థ సైజులో బియ్యం ఉంటాయి. ఆయుర్వేదంలో వాతం, పిత్తం, కఫం నివారణకు వాడతారని, మూడు వేల సంవత్సరాల కన్నా ఎక్కువ కాలం నాటిది అని చెప్పబడినది. కాలా చంపా. ఈ బియ్యం నలుపు రంగులో పొడుగుగా ఉంటాయి. అధిక దిగుబడి ఇస్తాయి. పంచరత్న. ఈ బియ్యం ఎరుపు రంగులో సన్నంగా ఉంటాయి. ఇందులో అమైనో ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయి. చికిలాకోయిలా. ఇవి ఎరుపుగా సన్నగా ఉంటాయి. ఇవి తింటే కిడ్నీలో రాళ్లు, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నవారికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. మైసూర్ మల్లిగా, నల్ల ముచ్చులు, ఘని, బహురూపీ, కుజిపాటలియా, మాపీలై సాంబా,



శ్రీనివాస్ వ్యవసాయ క్షేత్రంలో సాగు చేసిన వరి వంగడాలు

పుంగార్, కుళాకార్, సిద్ధ సన్నాలు, కాలభల్, తైవాస్ బ్లాక్, రత్నచోడి, యురినికైమా, నాసర్ బత్తా, రాజముడి, రమ్యగళి, కర్పుకాని, సన్న జాజులు, నవారా, ఇల్లపు పంట కరిగి జావళి, ముడిమురంగి, కెంపు నిన్నాలు, కుంకుమపాలి, ఇంద్రాణి, సుగంధి, మల్లిపూల్, బాసుమతి, బాస్ బోగ్, నిక్కో, జీరగ సాంబా, తులసీబాసో, రాధాజిగేల్, కాకిరెక్కలు, కామిని బోగ్, గంధపాలె, చిట్టి ముత్యాలు, పరిమళ సన్న జీదాపూల్, జీరా శంకర్, కృష్ణ బోగ్, గంధ సాలి, కబీర్ బోగ్, రఘునీ పాగల్, రాంజీరా, టిక్కి మిశ్రి, సమేళి బోగ్ , మోహన్ బోగ్ రకం విత్తనాలను వృద్ధి చేస్తున్నాడు.

## ప్రోత్సాహకాలు, పురస్కారాలు..

- 2011లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఉత్తమ రైతు అవార్డు
- 2017లో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఉత్తమ రైతు ఉగాది పురస్కారం
- 2016, 2019లో జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఉత్తమ రైతు పురస్కారం
- 2019లో పెద్దపల్లి జిల్లా స్థాయి ఉత్తమ ఉద్యోగి పురస్కారం
- 2022లో ధర్మపీఠం, మనోవికాస కేంద్రంల పురస్కారం
- 2022లో పెద్దపల్లి జిల్లా స్థాయి ఉత్తమ రైతు పురస్కారం

## నాన్న వ్యవసాయాన్నే అభిరుచిగా ఎంచుకున్నా..

మాది రైతు కుటుంబం. మా నాన్న వివిధ రకాల వరి సాగు చేస్తుండేవాడు. నాన్న చేసే పనులు చూసి నాకు కూడా ఇష్టం ఏర్పడింది. ఈ క్రమంలోనే వ్యవసాయ పాలిటెక్నిక్‌ను పూర్తి చేసుకున్న. నాకు ఇష్టమైన వ్యవసాయ శాఖలోనే ఉద్యోగాన్ని సాధించా. ఉద్యోగం వచ్చిన తర్వాత నా మూడెకరాల వ్యవసాయ క్షేత్రాన్ని దేశీయ వరి వంగడాల పరిరక్షణకు ఉపయోగిస్తున్నా. మొదట ఐదు దేశీయ రకాలను సాగు చేయడం మొదలు పెట్టి ఇప్పుడు 300 రకాల దాకా సాగు చేసే స్థాయికి ఎదిగా. నా దగ్గర నుంచి విత్తనాలు తెలంగాణలోని పలు జిల్లాల రైతులతో పాటుగా ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని రైతులకు అందిస్తున్నా. దేశీయ రకాలన్నీ సజీవంగా ఉండాలన్నదే నా లక్ష్యం. వాటి ప్రయోజనాలు అందరికీ అందాలన్నదే నా ఆకాంక్ష.

- యాదగిరి శ్రీనివాస్, ఏఈవో కమాన్‌పూర్, పెద్దపల్లి జిల్లా.